బాధిత కుటుంబానికి కోటి రూపాయల చెక్కు అందజేత

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని కష్టాల్లో మేము ఉన్నామని భరోసా కల్పిస్తుందని ఎమ్మెల్యే విజయచంద్ర అన్నారు. అచ్యుతాపురం ఘటనలో మృతి చెందిన పార్థసారథి కుటుంబాన్ని అన్ని విధాలా ప్రభుత్వం ఆదుకుంటుందని చెప్పారు. శుక్రవారం ఆయన కుటుంబాన్ని పరామర్శించి ప్రభుత్వ ఆర్థిక సహాయంగా కోటి రూపాయల చెక్కు అందజేశారు. అందొచ్చిన కొడుకును కోల్పోవడం బాధాకరమని సంతాపం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాట ప్రకారం 24 గంటల్లో ఆర్థిక చేయూత అందించారన్నారు. కుటుంబానికి జరిగిన నష్టాన్ని ఎవరూ పూడ్చలేరని ఆవేద వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేసి వారిని ఓదార్చారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, అధికారులు ,కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అప్పు లేకుండా సంక్షేమ పథకాలు

- సంపద సృష్టించడం చంద్రబాబుకే సాధ్యం
- గ్రామసభలో గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి

ప్రజాశక్తి - సాలూరు/రూరల్

రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెండు నెలల్లో రూపాయి అప్పు లేకుండా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత సిఎం చంద్రబాబు నాయుడు దేనని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి అన్నారు. సంపద సృష్టించడం చంద్రబాబు నాయుడు కే సాధ్యమని ఆమె చెప్పారు. మండలంలోని కూర్మరాజుపేటలో సర్పంచ్ ఆముదాల నళిని అధ్యక్షతన శుక్రవారం జరిగిన గ్రామసభలో ఆమె మాట్లాడారు. అంతకుముందు ఆమె డప్పు కొట్టి గ్రామసభను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంపద సృష్టించి అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేయడం సిఎం చంద్రబాబు నాయుడుకే తెలుసునని చెప్పారు. గతంలో మాజీ సిఎం జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వ కార్యాలయాలు తాకట్టు పెట్టి అప్పులు తెచ్చి సంక్షేమ పథకాలు అందించారని చెప్పారు. అలా చేయకుండా ప్రభుత్వం సంక్షేమ పాలన సాగిస్తోందని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒకేసారి 13,326 గ్రామ పంచాయతీల్లో గ్రామసభ లు నిర్వహించి అభివృద్ధికి ప్రణాళిక లు రూపొందించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఉపాధి హామీ చట్టం కింద రూ. 4500 కోట్లతో 87రకాల పనులు చేపట్టాలని నిర్ణయించామని చెప్పారు. గత ప్రభుత్వం హయాంలో పంచాయతీ సర్పంచ్‌లను ఉత్సవ విగ్రహాలు గా మార్చినట్లు చెప్పారు. చెక్ పవర్ ఉన్న నాయకుడు సర్పంచ్ మాత్రమేనని అన్నారు. అభివద్ధి ప్రణాళికల రూపకల్పనలో సర్పంచ్‌లదే కీలకపాత్ర అని అన్నారు. జల్ జీవన్ మిషన్ ద్వారా గత ప్రభుత్వం హయాంలో గ్రామాల్లో పైపులైన్లు వేసి వదిలేశారని, కుళాయి కనెక్షన్లు ఇవ్వలేదని చెప్పారు. ఇప్పుడు అలా జరగకుండా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలందరికీ తాగునీటి కుళాయి కనెక్షన్లు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే ఆర్‌పి భంజ్‌దేవ్, ఎంపిడిఒ గొరపల్లి పార్వతి, మండల టిడిపి అధ్యక్షులు ఆముదాల పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

డప్పు కొట్టి గ్రామసభను ప్రారంభిస్తున్న రాష్ట్రమంత్రి గుమ్మిడి సంధ్యారాణి

పార్వతీపురం రూరల్ : మండలంలోని వెంకంపేట పంచాయితీలో జరిగిన గ్రామసభలో రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖామంత్రి సత్యకుమార్ యాదవ్ కలెక్టర్ ఎ.శ్యాం ప్రసాద్ కలిసి పాల్గొన్నారు. సర్పంచి తీళ్ల కృష్ణారావు అధ్యక్షతన జరిగిన గ్రామసభలో ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి మాట్లాడుతూ ఉపాధి హామీ పనుల ద్వారా పంచాయితీలను పటిష్టం చేసి, గ్రామాల్లో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడమే కాకుండా పంచాయితీలకు ఆస్తులను కల్పించే కార్యక్రమం జరుగుతుందన్నారు. ఉపాధి కోసం గ్రామాలను విడిచి వెళ్లే పరిస్థితి దాపురించకుండా పని అడిగిన ప్రతి ఒక్కరికి పనిని కల్పించడమే ధ్యేయంగా పెట్టుకున్నామన్నారు. ఎలాంటి అవినీతికి తావు లేకుండా గ్రామ సభల ద్వారానే ప్రజల సమక్షంలో పనులు తీర్మానించాలని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ కమిషనర్ హరి నారాయణ, పార్వతీపురం కురుపాం ఎమ్మెల్యేలు బోనాల విజయేద్ర, తోయక జగదీశ్వరి , డ్వామా పీడీ కె.రామచంద్రరావు స్థానిక ఎంపీటీసీ సిద్ధ జగన్నాథ రావు తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణ గ్రామాలుగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ ధ్యేయం : కలెక్టర్

గ్రామాల్లో సమస్యలు పరిష్కరించి స్వర్ణ గ్రామాలుగా అభివృద్ధి చెందడమే ప్రభుత్వ ధ్యేయమని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. మండలంలోని ఎంఆర్‌నగర్‌లో నిర్వహించిన గ్రామ సభలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన నాలుగు అంశాలపై చర్చించి గ్రామ నిర్మాణంతో గ్రామ వికాసం దిశగా అడుగులు వేయాలన్నారు. గ్రామస్తులతో మాట్లాడి సమస్యలను కలెక్టర్ తెలుసుకున్నారు. గ్రామస్తుల ఆధారిత పంటలు, ఉద్యానవన పంటల సాగు వివరాలను అడిగి తెలుసుకున్నారు. సాగునీటి సమస్య ఉందని కలెక్టర్ దృష్టికి తీసుకురాగా వర్షపు నీటిని సంరక్షించేందుకు ఇంకుడు గుట్టలను ఏర్పాటు చేసుకోవాలని, సోలార్ విద్యుత్‌తో బోరు బావుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ వంగపండు లక్ష్మి, ఉప సర్పంచ్ త్రినాథ నాయుడు, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, డిఎల్‌డిఒ రమేష్ రామన్, ఎంపిడిఒ షేక్ అబ్దుల్ అకిబ్ జావేద్, గ్రామ సచివాలయ సిబ్బంది, తదితరులు, పాల్గొన్నారు.

పార్వతీపురం మండలం వెంకంపేటలో వైద్య, ఆరోగ్యశాఖమంత్రి సత్యకుమార్‌యాదవ్

పట్టణ ప్రాంతాల కంటే మెరుగైన సేవలు

రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్/ సీతానగరం

జిల్లాలో వైద్యులు పట్టణ ప్రాంతాల కంటే మెరుగైన వైద్య సేవలందిస్తున్నారని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ అభినందించారు. శుక్రవారం ఆయన జిల్లా ఆసుపత్రిని సందర్శించారు. తొలుత ఆసుపత్రిలో అన్ని విభాగాలను తనిఖీచేశారు. డయాలసిస్ విభాగం, ఇన్సెంటివ్ వార్డు, జనరల్ వార్డు, సికిల్ సెల్ ఎనిమియా తదితర విభాగాలను సందర్శించారు. రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలను గురించి అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో మౌలిక సదుపా యాలు గూర్చి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఒపి., ప్రసవాలు, జ్వరాల కేసులు వివరాలను వైద్యులు వివరించారు. సికిల్‌సెల్ ఎనిమియా రోగులకు కార్డులను అందజేశారు. అనంతరం అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆసుపత్రులకు కావాల్సిన సదుపాయాలు, ఇబ్బందులు గురించి వైద్యాధికారులు మంత్రికి తెలిపారు. సిబ్బంది కొరత, అంబులెన్స్‌ల కండిషన్, ఫీడర్ అంబులెన్స్ సేవలు, ప్రసూతి సేవలను గూర్చి తెలియజేస్తూ, మరణించిన వారిని తీసుకువెళ్లేందుకు గిరిజనులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మహాప్రస్థానం వాహనాలు కావాలని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆసుపత్రుల్లో మౌళిక సదుపాయాలు, డయాలసిస్, సిబ్బంది కొరత, ఈ ప్రాంత ప్రజలకు అందుతున్న సేవలను పరిశీలించి మెరుగైన వైద్యసేవలందించేందుకు తీసుకోవాల్సిన చర్యలు తెలుసుకొనేందుకు పర్యటించినట్టు తెలిపారు. గిరిజనులను, ఆదివాసీలను కుటుంబ సభ్యులుగా భావించి సేవలందించాలని తెలిపారు. పార్వతీపురం, సాలూరు, సీతంపేట, భద్రగిరిలో ఆసుపత్రుల భవన నిర్మాణపనులు పూర్తిచేసి, సిబ్బందిని నియమిస్తామని తెలిపారు. ప్రతి ఏరియా ఆస్పత్రికి మహాప్రస్థానం వాహనాలు సమకూరుస్తామని హామీ ఇచ్చారు. కలెక్టరు ఎ. శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో మలేరియా ఎక్కువగా ఉందని, దోమల నివారణకు గతనెలలో ప్రత్యేక శానిటేషను కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. జిల్లాలో రక్తకొరతను నివారించేందుకు ప్రత్యేక రక్తసేకరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాలకొండలో బ్లడ్ బ్యాంకు ఏర్పాటు చేశామని, సాలూరు కూడా ఏర్పాటు చేయాలని తెలిపారు. ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర మాట్లాడుతూ జిల్లాకు అంబులెన్స్ లు, ఫీడర్ అంబులెన్స్ లు ఎక్కువగా మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ సి.హరికిరణ్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, నిమ్మక జయకష్ణ, ఆర్‌డిఒ కె.హేమలత, డిఎంహెచ్‌ఒ విజయపార్వతి, సూపరింటెండెంటు వాగ్దేవి, డాక్టరు వినోద్, అధికారులు పాల్గొన్నారు.

జిల్లా ఆస్పత్రిలో రోగితో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

పారిశుధ్య సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

జిల్లా ఆసుపత్రులు, ప్రాంతీయ ఆసుపత్రులు, సామాజిక వైద్య ఆరోగ్య కేంద్రాల్లో పారిశుధ్యం, భద్రతా, చెద పురుగులు నివారణ సిబ్బంది, సూపర్వైజర్ సిబ్బందికి జరుగుతున్న వివక్షతను సరిచేయాలని ఎఐటియుసి జిల్లా కార్యదర్శి ఆర్వీఎస్ కుమార్ అన్నారు. ఈ మేరకు జిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రికి వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు సింహాద్రి దుర్గారావు, నాయకులు అలజంగి కుమారమ్మ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

సీతానగరం : రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ అధికారులను ఆదేశించారు. సీతానగరం పిహెచ్‌సిని తనిఖీ చేశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సికిల్ సెల్ ఎనీమియా రోగులతో మాట్లాడారు. వారికి అందుతున్న వైద్య సేవల గురించి, పెన్షన్ సక్రమంగా అందుతున్నదీ లేనిదీ అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిర్మాణంలో గల పిహెచ్‌సిని పరిశీలించారు. ఆసుపత్రిలో జ్వరాల కేసులు, వాటికి అందిస్తున్న చికిత్స గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి భవన నిర్మాణ పనులు అత్యంత నాసికంగా ఉండడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. బాధ్యులైన అధికారులు, కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం జోగింపేటలో గల కస్తూరిబా గాంధీ బాలికల జూనియర్ కళాశాలను సందర్శించారు. తరగతి గదులను, వంటశాలను తనిఖీ చేశారు. పర్యటనలో ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ సి.హరికిరణ్, కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్, ఎమ్మెల్యేలు బోనెల విజయ్ చంద్ర, తోయక జగదీశ్వరి, నిమ్మక జయకృష్ణ చిరంజీవి, ఆర్‌డిఒ కె.హేమలత తదితరులు పాల్గొన్నారు.

25న మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఎన్నిక

పార్వతీపురం : మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక ఈనెల 25న జరుగుతుందని జిల్లా కన్వీనర్ విక్రమ్ అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని వేదాంత జూనియర్ కాలేజీలో జరుగు ఈ ఎన్నికకు పరిశీలకులుగా చల్లా జగదీష్ ,బల్ల రమేష్ వ్యవహరిస్తారన్నారు. కావున మన్యం జిల్లాలో గల మాస్టర్స్ అథ్లెట్స్ అంతా వచ్చి ఈ సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఎన్ఎంఎంఎస్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - పార్వతీపురం

డిసెంబర్ 8న నిర్వహించబోయే నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్షిప్ పరీక్ష కొరకు దరఖాస్తులు చేసుకొనుటకై అవకాశం కల్పిస్తున్నట్లు డిఇఒ జి.పగడాలమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష (ఎన్ఎంఎంఎస్) కోసం దరఖాస్తు చేసుకొనుటకు ఆన్లైన్ అప్లికేషన్‌ను ప్రభుత్వ పరీక్షల కార్యాలయ వెబ్సైట్ www.bse.ap.gov.inలో ఈనెల5 నుంచి అందుబాటులో ఉంచడమైందన్నారు. ఈ పరీక్షకు నమోదు చేసుకొనేందుకు ఆఖరు తేదీ సెప్టెంబర్ 6 వరకు ఉందన్నారు. నమోదు చేసే సమయంలో విద్యార్థి ఆధార్ కార్డ్ లో ఉన్న విధంగానే విద్యార్థి పేరు, పుట్టిన తేదీ మరియు తండ్రి పేరు నమోదు చేయవలెను. జిల్లా లోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మునిసిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు, వసతి సౌకర్యం లేని జిల్లా ఆదర్శ పాఠశాలలో 8వ తరగతి చదువుతూ, కుటుంబ సంవత్సరాదాయం రూ.3,50,000 లోపు ఉన్న విద్యార్థులంతా అర్హులు. దరఖాస్తు చేసుకొనేందుకు ఎటువంటి ధ్రువపత్రాలు అవసరం లేదు. పరీక్ష రాసే సమయానికి అన్ని ధ్రువపత్రాలు సిద్ధం చేసుకోవాలి. పరీక్ష రుసుం ఒసి, బి.సి విద్యార్థులకు రూ.100, ఎస్‌సి, ఎటి విద్యార్థులకు రూ.50. పరీక్ష రుసుంను ఆన్లైన్ అప్లికేషన్‌లో ఇవ్వబడిన SBI Collect లింకు ద్వారా మాత్రమే చెల్లించాలి. పూర్తి వివరముల కొరకు ప్రభుత్వ పరీక్షల సంచాలకుల కార్యాలయపు వెబ్ సైటు www.bse.ap.gov.in నందు గానీ లేదా జిల్లా విద్యాశాఖాధికారి వారి కార్యాలయంలో గాని తెలుసుకోవాల్సిందిగా డిఇఒ ఆ ప్రకటనలో తెలిపారు.

సిలబస్ కిట్‌ను అందజేస్తున్న డిఇఒ పగడాలమ్మ

ఘనంగా టంగుటూరి జయంతి

ప్రజాశక్తి - పార్వతీపురం

రాష్ట్రానికి మొదటి ముఖ్యమంత్రిగా పని చేసిన టంగుటూరి ప్రకాశం పంతులు నిరుపేద కుటుంబంలో పుట్టి, వారాలు చేసుకుంటూ చదువుకుని ఆంధ్ర రాజకీయాల్లో ప్రముఖంగా వెలుగొందిన వ్యక్తుల్లో ఒకరని జెసి ఎస్ఎస్ శోభిక అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో టంగుటూరి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జాయింట్ కలెక్టర్ హాజరై టంగుటూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం జెసి మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు స్ఫూర్తితో రాష్ట్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని తెలిపారు. స్వాతంత్రోద్యమంలో పాల్గొన్న ప్రకాశం పంతులు మద్రాసులో సైమన్ కమిషన్ వ్యతిరేక ప్రదర్శనలో తుపాకీ గుళ్లకు ఎదురుగా గుండెను ఎదురొడ్డి ఆంధ్రకేసరి అని పేరు పొందారన్నారని కొనియాడారు. సేద్యపు నీటి ప్రాజెక్టుల నిర్మాణం, విజయవాడ వద్ద కృష్ణా నదిపై బారేజి నిర్మాణం వీటిలో ప్రముఖమైనవని తెలిపారు. నిస్వార్థంతో దేశ స్వాతంత్ర్యానికి, రాష్ట్ర అభివృద్ధికి పాటుపడిన టంగుటూరి ప్రకాశం పంతులు జీవితం నేటియువతకు ఎంతో స్ఫూర్తిదాయకమని, వారి చరిత్ర నేటి విద్యార్థులకు బోధించాల్సిన అవసరం ఉందని తెలిపారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ జి.కేశవ నాయుడు, కలెక్టరేట్ ఎఒ ఎం.సావిత్రి, ఈ సెక్షన్ సూపరింటెండెంట్ శ్రీరామ్మూర్తి, సి సెక్షన్ సూపరింటెండెంట్ సిహెచ్.రాధాకృష్ణ, కలెక్టరేట్ కార్యాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టంగుటూరికి నివాళ్లు అర్పిస్తున్న జెసి శోబిక, డిఆర్ఒ కేశవనాయుడు

ఎస్‌పి కార్యాలయంలో...

పార్వతీపురం రూరల్ : టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలు స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ ఎస్‌వి మాధవరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రకాశం పంతులు నిజాయితీ, నైతిక విలువలతో కూడిన జీవనశైలి మార్గదర్శకంగా తీసుకొని మనమంతా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎఆర్ డిఎస్పీ ఎస్.వి.అప్పారావు, ఎస్బి సిఐ సిహెచ్.లక్ష్మణరావు, డిసిఆర్‌బి సిఐ బి.ఎం.డి.ప్రసాదరావు, ఆర్‌ఐలు శ్రీరాములు, శ్రీనివాసరావు, ఆర్ఎస్‌ఐలు, ఎస్‌ఐలు, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సాలూరు: ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు సేవలు ఆదర్శప్రాయమని శ్రీ వెంకట విద్యా గిరి పాఠశాల కరస్పాండెంట్ కోడూరు సాయి శ్రీనివాసరావు చెప్పారు. తొలుత ప్రకాశం జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాఠశాల హెచ్‌ఎం కోడూరు లక్ష్మి మాట్లాడుతూ టంగుటూరి ఆశయాల సాధనకు విద్యార్థులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాలకొండ : స్థానిక శాఖా గ్రంథాలయంలో టంగుటూరి ప్రకాశం పంతులు 152 వ జయంతి సందర్భంగా శుక్రవారం ఆయన చిత్ర పటానికు పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఇన్-ఛార్జ్ గ్రంథాలయ అధికారి బి.గణేష్ బాబు మాట్లాడుతూ ప్రకాశం పంతులు రాష్ట్రానికి చేసిన సేవలు మరువలేనివని అన్నారు. కార్యక్రమంలో పాఠకులు వై.మహేష్, పురుషోత్తం, సహాయకుడు ఈశ్వర్ పాల్గొన్నారు.

నేరడిబ్యారేజి రెగ్యులేటర్ పరిశీలన

ప్రజాశక్తి -భామిని

మండలంలోని నేరడి బ్యారేజ్ కుడి కాలువకు వంశధార నది నుంచి నీటి ప్రవాహం అనుమతించే హెడ్ రెగ్యులేటర్ ఇసుక పేరుకుపోయిందని, పేరుకున్న ఇసుకను తొలిగిస్తే తప్ప కుడి కాలువకు నీటి ప్రవాహం రాదని గతంలో ఇరిగేషన్ ఎస్ఇ కలెక్టర్‌కు తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సీతంపేట ఇన్‌ఛార్జి పిఒ వివి రమణ కాట్రాగడ్ వద్ద ఉన్న ఓపెన్ హెడ్ రెగ్యులేటర్‌ను శుక్రవారం పరిశీలించారు. ఓపెన్ హెడ్ రెగ్యులేటర్ నుంచి జెసిబితో ఇసుక తొలిగించి, నేరడి వద్ద తీసిన ఇసుక స్టోరేజ్ చేసి, రవాణా చేస్తామని ఇంచార్జి పిఒ తెలిపారు. ఈ ప్రక్రియ మొత్తం పది రోజుల్లో చెప్పడతామన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ కోటేశ్వరరావు, మైనింగ్ అధికారులు పాల్గొన్నారు.

గర్భిణుల హాస్టల్ పనులు పూర్తి చేయాలి : పిఒ

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక వైటిసిలో ఏర్పాటు చేయనున్న గర్భిణుల వసతిగృహ పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని ఐటిడిఎ పిఒ వివి రమణ అన్నారు. పనులు పూర్తయిన వెంటనే వసతిగృహాన్ని ప్రారంభిస్తామని పిఒ అన్నారు. గర్భిణీలకు అనుకూలంగా వుండే ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించాలని సూచించారు. వసతిగృహంలో ఏర్పాటు చేసే మంచాలు, పరుపులు, ఇతర వస్తువులు నాణ్యమైనవి ఏర్పాటు చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఎపిఒ చినబాబు, ఇఇ సింహాచలం, ఎఇ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమ స్ఫూర్తితో ప్రకృతి వ్యవసాయ పాఠాలు నేర్పాలి : డిఇఒ

ప్రజాశక్తి - గరుగుబిల్లి

ప్రతి ఉపాధ్యాయుడు తప్పనిసరిగా విద్యార్థులను విజ్ఞానవంతులుగా తయారు చేసి, వారికి వ్యవసాయం పరిచయం చేయాలని, ప్రకృతి వ్యవసాయ విధానాలు నేర్చుకుని మొట్టమొదటి సంపూర్ణ ప్రకృతి వ్యవసాయ పాఠశాల జిల్లాగా రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందేలా అందరూ కృషి చేయాలని డిఇఒ జి.పగడాలమ్మ అన్నారు. మండలంలోని తోటపల్లి జట్టు ట్రస్ట్ ప్రాంగణంలో 'మన బడి మన తోట' ఒకరోజు శిక్షణా కార్యక్రమం శుక్రవారం జరిగింది. జట్టు ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ డి.పారినాయుడు అధ్యక్షతన కార్యక్రమంలో జిల్లా నుండి 52 మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. అనంతరం డిఇఒ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ప్రయోజనాలు ప్రాక్టికల్ రూపంలో చూపి విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. పారినాయుడు మట్లాడుతూ జట్టు ద్వారా నిర్వహించిన బడి నుండి పొలం బడికి కార్యక్రమ వివరాలు తెలిపారు. వ్యవసాయంలో చోటు చేసుకున్న అనేక మార్పులు వల్ల, విచ్చలవిడిగా వినియోగిస్తున్న రసాయనాల వలన కలుగుతున్న అనర్థాలను వివరించారు. రీజినల్ తీమాటిక్ లీడ్ ప్రకాష్ ప్రకృతి వ్యవసాయంలో శాస్త్రీయతని సోదాహరణంగా వివరించారు. రీజినల్ టెక్నికల్ ఆఫీసర్ హేమసుందర్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విధానాల్లో పాటించే 9 సార్వత్రిక సూత్రాలలు, వాటి ప్రాధాన్యతను వివరించారు. డిపిఎం షణ్ముఖరాజు మాట్లాడుతూ సహజ సేద్యం ద్వారా భూమిలో జరిగే మార్పులను, వ్యవసాయానికి, పర్యావరణానికి, మానవులకు జరిగే మేలును వివరించారు. రీసోర్స్ పెర్సన్లుగా వ్యవహరించిన రైతు వాసుదేవరావు, నల్ల బాలకృష్ణారావు, పక్కి రవీంద్రనాథ్, ఎం. నూకంనాయుడు ప్రకృతి వ్యవసాయంలో వివిధ అంశాలను వివరించారు. ఆర్‌వైఎస్ఎస్ సిలబస్ కన్సల్టెంట్ టి.శివాజీ, జట్టు ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సరోజ్ ప్రహరాజ్, గాయకుడు వి.సన్యాసిరావు, జట్టు బృందం పాల్గొన్నారు.

మరుగుదొడ్ల ఫొటోలు తీసే బాధ్యత ఎస్ఎంసిలకా?

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

ప్రస్తుత ప్రభుత్వంలో పాఠశాలల్లో మరుగుదొడ్ల ఫొటోలను ఉపాధ్యాయులు తీయనవసరం లేదని ఇచ్చిందని, అయితే వారానికి రెండుసార్లు ఎస్ఎంసి చైర్మన్లు,, పాఠశాలకు వచ్చి హెచ్‌ఎం ఫోన్లో లాగిన్ అయి మరుగుదొడ్ల ఫొటోలు అప్లోడ్ చేయాలని ఆదేశించడం పాఠశాల మేనేజింగ్ కమిటీ చైర్మన్లను అవమానపరచడమేనని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహనరావు అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఎస్ఎంసి చైర్మన్‌కు హెచ్‌ఎం కబురు పంపి, చైర్మన్‌ను రాకపోతే హెచ్ఎంలే ఫొటోలు తీసి అప్లోడ్ చేయాలని ఆదేశించడం దారుణమన్నారు. ఈ మరుగుదొడ్లకు ఫొటోలు తీసి అప్లోడ్ చేయడం అవసరంలేని పని అని, ఆయాలు ప్రతిరోజు శుభ్రం చేస్తున్నారని, వీటిని హెచ్ఎంలు పర్యవేక్షిస్తున్నారని అన్నారు. కావున మరుగుదొడ్లకు ఫొటోలు తీసే యాప్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులంతా ఫొటోలలో యాప్‌లో లోడ్ చేయకుండా నిరసన తెలియచేయాలని కోరారు.

నీట మునిగిన పంట పొలాలు

ఏటా ఇదే దుస్థితి • విఆర్ఎస్ అధికారుల నిర్లక్ష్యమే కారణమంటన్న రైతులు

ప్రజాశక్తి - మక్కువ

వెంగళరాయ సాగర్ కుడి ప్రధాన కాలువకు ఆనుకొని ఉన్న పొలం రైతులకు ప్రతి ఏటా నీటి కష్టాలు తప్పడం లేదు. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టిన నీటిముంపుతో అంతా నష్టపోవాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని చెముడు పంచాయతీలోని పాలికివలసకు చెందిన గిరిజనులు గుల్లిపల్లి బురదయ్య, పెంటయ్య, బోను అప్పలస్వామి, కర్రి సత్యం, ముట్నూరు వెంకటమూర్తి తదితరులకు చెందిన వరి పంట సాగు చేస్తున్నారు. అయితే లింగాడవలస వద్ద వెంగళరాయ సాగర్ ప్రాజెక్ట్ అధికారులు నిర్మించిన తూము ఎత్తు కావడం, దిగువకు పొలాలు ఉండడం వల్ల ప్రతి ఏటా ముంపు తప్పడం లేదు. ఒకవైపు పాటి చెరువు నీరు, మరోవైపు విఆర్ఎస్ ఆర్ఎంసి కాలువ లీకేజీ నీరు ఎక్కువ కావడంతో సుమారు మూడు ఎకరాలు పంట పొలం చెరువులా మారుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్ఎంసి కాలువ లైనింగ్ పనులు ఈ ప్రాంతంలో ఒకవేళ పూర్తి అయినట్లయితే మరింత ఇబ్బంది ఎదుర్కోవలసి వస్తుందని వారు అంటున్నారు. లింగాడవలస వద్ద నిర్మించిన యుటి ఎత్తు తగ్గించినట్లయితే పొలంలో నీరు బయటికి వెళ్లేందుకు ఆస్కారం ఉందని రైతులు అంటున్నారు. ఇదే విషయాన్ని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఫలితం లేకపోతుందని రైతులు కలత చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి పంట పొలాలు ముంపునకు గురికాకుండా చూడాలని గిరిజన రైతులు కోరుతున్నారు.

నీటమునిగిన పొలాన్ని చూపుతున్న రైతులు

పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

హత్యాచార బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన ర్యాలీ, ధర్నా

ప్రజాశక్తి - సాలూరు

కలకత్తాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ అధ్వర్యాన విద్యార్థులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం బోసు బొమ్మ జంక్షన్‌లో ధర్నా చేశారు. ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి జి.సింహాద్రి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కె.రాజు మాట్లాడుతూ విధి నిర్వహణలో వున్న జూనియర్ డాక్టర్‌పై కిరాతకంగా హత్యాచారం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దోషులను శిక్షించడంలో పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం తాత్సారం చేయడం అన్యాయమని అన్నారు. దేశంలో ప్రతి పది నిమిషాలకో మహిళపై అత్యాచారం జరుగుతోందని చెప్పారు. మహిళల రక్షణకు ఉన్న చట్టాలను సక్రమంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కోశాధికారి టి.అఖిల్,మండల నాయకులు జి.కళ్యాణ్,ఎస్.రంజిత్ పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు రూ.600 ఇవ్వాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

వామపక్ష పోరాట ఫలితంగా వచ్చిన ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, రోజువారి కూలీ రూ.600 ఇవ్వాలని సిపిఎం మండల నాయకులు మండంగి సన్యాసిరావు కోరారు. మండలంలోని లుంబేసులో నిర్వహించిన గ్రామ సభలో ఆయన మాట్లాడారు. 200 రోజులు పని దినాలు కల్పించాలని, పారా, గునపాం వంటి పనిముట్లు ఇవ్వాలని, కూలీల డబ్బులు వారంలో చెల్లించాలని, 18 ఏళ్లు నిండిన యువతీ యువకులకు పని కల్పించాలని, పని ప్రదేశం వద్ద తాగునీరు, మందులు అందుబాటులో ఉంచాలని, ఒక్క పూట మాత్రమే పని కల్పించాలని కోరారు.

నర్సిపురంలో ప్రత్యేక వైద్య శిబిరం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలం పరిధిలోని సంత నర్సిపురంలో శుక్రవారం ప్రత్యేక వైద్య శిబిరం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి జ్వర పీడితులతో పాటు వివిధ రకాలైన రోగులకు ప్రత్యేక వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు జనార్దన్‌రావు, శాంతకుమారి, ఆదిలక్ష్మి, ఆనంద్, ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీని ప్రారంభిస్తున్న మంత్రి సంధ్యారాణి

అవయవ దానంపై అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి - సాలూరు

అవయవదానంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అవయవదానం పై మీకై మేము స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యాన నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆమె జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం జరిగిన సదస్సులో ఆమె మాట్లాడారు. మరొకరికి ప్రాణదానం చేయడానికి అవయవదానం, రక్తదానం ఉపయోగపడతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రాణదాత ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ వి.గణేశ్వరరావు, డాక్టర్ పెంట శ్రీనివాసరావు, టౌన్ సిఐ అప్పలనాయుడు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

భామినిలో వరుస నాటుపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

అధిక దిగుబడులు సాధించాలి

ప్రజాశక్తి - కురుపాం

రైతులు సాంకేతికతను అందిపుచ్చుకొని పంటల్లో అధిక దిగుబడులు సాధించాలని కెవికె సమన్వయకర్త ధ్రువ అన్నారు. శుక్రవారం కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల్లోని పొడి, జెకె పాడు, వంజరాపుగూడ గ్రామాల్లో పంట పొలాలను పరిశీలించారు. వరిలో ప్రతి రెండు మీటర్ల నాట్లకు 20 సెంటీమీటర్ల కాలిబాటలు వదలాలని, అలాగే వేరుశనగ పూతదశలో ఉన్నందున ఎకరాకు 200 కిలోల జిప్సంను వేసుకుంటే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. ఆనంతరం పంటల్లో తెగుళ్ల వ్యాపించకుండా పలు జాగ్రత్తలను రైతులకు సూచించారు. కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్తలు స్రవంతి, అమృతవీణ, అనంతవిహారి పాల్గొన్నారు.

భామిని : మండలంలోని గురండిలో పొలం బడి కార్యక్రమంలో భాగంగా మండల వ్యవసాయధికారి కె.సింహాచలం రైతులతో కలిసి వరి వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వరి నాటు పొలాల్లో ఆకుముడత పురుగును గుర్తించినట్లు తెలిపారు. కానీ ఆకు ముడత పురుగుతో పాటు మిత్ర పురుగులైన సాలీడు, తూనీగలు ఎక్కువగా ఉన్నందున ప్రస్తుతం ఎటువంటి పురుగు మందుల అవసరం లేదని తెలిపారు. కార్యక్రమంలో జిఎపి పొలంబడి ఫీల్డ్ ఆఫీసర్ కె.ఈశ్వర్, ఆడిటర్ ఎన్.దినేష్, క్షేత్ర వ్యవసాయ సహాయకులు ఎ..నిఖిల్‌తో పాటు రైతులు సతీష్, ప్రసాదరావు, లాక్షిణరాయణ, నూకరాజు, సురేంద్ర, బికోరి, బేదారు తదితరులు పాల్గొన్నారు.

అవకతవకలు లేకుండా ఐటిఐ పరీక్షలు నిర్వహించాలి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

ఐటిఐ పరీక్షల్లో అవకతవకలు జరగకుండా నిర్వహించాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రవికుమార్ అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఐటిఐలు విద్యార్థుల నుంచి పరీక్షలకు హెల్పింగ్ ఫీజ్ అని రూ.5వేలు నుంచి రూ.7వేల వరకు వసూలు చేశారని ఆరోపించారు. విద్యార్థులకు మాస్ కాపీ కాపీయింగ్ జరగకుండా ఏర్పాటు చేస్తామని చెబుతూ వారి నుంచి అక్రమంగా ఫీజులు వసూలు చేయడం విడ్డూరంగా ఉందని అన్నారు. అధికారుల పర్యవేక్షణ లోపం వల్లే ఇలాంటి అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. తక్షణమే ఆర్‌డిడి స్పందించి ఎటువంటి అవకతవకలు జరగకుండా పరీక్షలు నిర్వహించాలని కోరారు.

వంద పడకల ఆసుపత్రిగా అప్ గ్రేడ్ చేయండి

ప్రజాశక్తి- బొబ్బిలి

బొబ్బిలి ప్రభుత్వ ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అప్ గ్రేడ్ చేయాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను ఎమ్మెల్యే బేబినాయన, ఆసుపత్రి సూపరింటెండెంట్ జి.శశిభూషణరావు కోరారు. పార్వతీపురం వెళ్లిన మంత్రి బొబ్బిలి కోటకు వచ్చిన సందర్భంగా ప్రతిపాదనలను అందజేశారు.

గ్రామాలు దేశానికి పట్టుగొమ్మలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గరుగుబిల్లి

దేశాభివృద్ధికి గ్రామాలు పట్టుగొమ్మలని, వాటిని అభివృద్ధి చేసుకొనే బాధ్యత ప్రతిపౌరునిపై ఉందని కురుపాం ఎమ్మెల్యేలు తోయక జగదీశ్వరి అన్నారు. మండలంలోని సంతోషపురంలో జరిగే గ్రామసభలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో ఉన్న సమస్యలను గ్రామసభ ద్వారా చర్చించి పరిష్కరించడానికి ప్రభుత్వ సహాయ సహకారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అంబటి తవిటినాయుడు, ఎంపిడిఒ పైడితల్లి , పంచాయతీ కార్యాలయ సిబ్బంది, టిడిపి మండల కన్వీనర్ అక్కిన మధు, బిసి సెల్ కార్యదర్శి పురుషోత్తంనాయుడు, అంబటి రామకృష్ణ, వెంపడాపు భారతి, కడ్రక కళావతి, అడ్డాకుల నరేష్ , పోలూరు శ్రీను, కొనిస మన్మధ పాల్గొన్నారు.

వీరఘట్టం : గ్రామాలు అభివృద్ధి జరగాలంటే అందరి సహకారం అవసరమని స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన స్వర్ణ గ్రామ సభ కార్యక్రమంలో మాట్లాడారు. గ్రామాల్లో తాగునీటి సమస్య, మురికి కాలువల నిర్వహణ, విద్యుత్తు వంటి సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. వీరఘట్టంలో ఆర్‌టిసి కాంప్లెక్స్ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఆర్టీసీ కాంప్లెక్స్ నిర్మాణం జరిగితే గ్రామాలు కూడా అభివృద్ధి జరుగుతుందని ఆయన తెలిపారు. వీరఘట్టంలో కాలువలు కనుమరుగు కావడంతో కురుస్తున్న వర్షాలు వల్ల వరద నీరు రోడ్డుపైకి ప్రవేశిస్తుందని వీటి కారణంగా రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నామని, అలాగే గ్రామాల్లో బ్లీచింగ్ చల్లడం, ఫాగింగ్ వంటి కార్యక్రమాలు స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీనికి ఎమ్మెల్యే స్పందిస్తూ తక్షణమే గ్రామంలో పారిశుధ్య మెరుగుకు చొరవ తీసుకోవాలని ఇఒ పి.రామును ఆదేశించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పి.కృష్ణమూర్తినాయుడు, ఉదయాన ఉదయ భాస్కర్, జామి లక్ష్మీనారాయణ , బల్ల హరిబాబు, డిఎల్‌పిఒ జె.రాంప్రసాద్, తహశీల్దార్ సిహెచ్ సత్యనారాయణ, పంచాయతీరాజ్ జెఇ కళ్యాణ దుర్గ, ఇఒపిఆర్‌డి ఎం.నాగభూషణరావు, ఎపిఒ జి.సత్యం నాయుడు, ఆర్.రత్నాకర్, టి.రమేష్, బి.నారాయణరావు, అధికారులు, గ్రామస్తులు ,పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని గుమ్మలక్ష్మీపురం, ఎల్విన్‌పేట, లక్కగూడ, ఇరిడి, తాడికొండ, రెల్ల, కేదారిపురం, నోంద్రకోన, దుడ్డుఖల్లు, టైగర్ పంచాయతీ శుక్రవారం గ్రామసభలు నిర్వహించారు. ఎల్విన్ పేటలో నిర్వహించిన గ్రామసభలో మండల టిడిపి కన్వీనర్ పాడి సుదర్శన్‌రావు, గుమ్మలక్ష్మీపురంలో సర్పంచి గౌరీ శంకర్రావు పలువురు అధికారులు పాల్గొన్నారు.

సీతానగరం :మండలంలోని 35 పంచాయతీలలో శుక్రవారం గ్రామ సభలో నిర్వహించారు ఈ సందర్భంగా లచ్చయ్యపేటలో ఇఒపిఆర్‌డి కెకె కుమార్ వర్మ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి గ్రామసభ ద్వారా గ్రామానికి సంబంధించి చేయాల్సిన పనులను తీర్మానాల ద్వారా గుర్తించి అభివృద్ధి చేయాలన్నారు. అలాగే ప్రతి గ్రామంలో సిసి రోడ్లు, గ్రావెల్ రోడ్లు, మౌలిక సదుపాయాలకు సంబంధించిన అంశాలను గుర్తించి తీర్మానాలు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి ఎం.బాబ్జీ, సర్పంచ్ సిహెచ్ కృష్ణ, సచివాలయ, ఉపాధిహామీ సిబ్బంది, సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

కొమరాడ : మండలంలోని 31 గ్రామపంచాయతీలో గ్రామసభలు జరిగాయి. ఈ గ్రామసభలో ముఖ్యఅతిథిగా ముఖ్యఅతిథిగా ఎంపిడిఒ మల్లికార్జునరావు పాల్గొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బంది, పలువురు సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

సీతంపేట : మండలంలో 53 పంచాయతీల్లో గ్రామసభలు అధికారులు నిర్వహించారు, గోయిది, కుడ్డపల్లి గ్రామ సభలకు జిల్లా స్పెషల్ అధికారి గయాసుద్దీన్ సందర్శించారు. గ్రామ సభలో తీర్మానాలు స్వీకరించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి ఎస్.సింహాచలం, ఎంపిడిఒ గీతాంజలి, ఇఒపిఆర్‌డి కొండపల్లి సత్యం, సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

మక్కువ : మండలంలోని మక్కువకు చెందిన బైరిసాగరం చెరువును అభివృద్ధి చేయాలని, అలాగే మార్కెట్లోనూ ఆర్అండ్‌బి రహదారికి అనుకున్న షాపులను వరుస క్రమంలో నిర్మించాలని టిడిపి సీనియర్ నాయకులు మావుడి ప్రసాదరావు నాయుడు వినతి అందజేశారు. శుక్రవారం స్థానిక సచివాలయంలో సర్పంచ్ లక్ష్మీ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్‌నాయుడు మాట్లాడుతూ బైరి సాగరం చుట్టూ సిమెంటు రహదారిని నిర్మించి మేజర్ పంచాయతీ ప్రజలకు వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలన్నారు. అలాగే గట్టు చుట్టూ మొక్కలు నాటితే మంచి వాతావరణాన్ని తయారు చేయాలన్నారు. బైరి సాగరం అభివద్ధి వలన మక్కువలోని పలు వీధుల్లో బోరు బావుల్లో భూగర్భ జలాలు పెరిగి తాగునీటి సమస్య కూడా లేకుండా ఉంటుందన్నారు ప్రభుత్వ అధికారులు ప్రతిపాదనలు తయారు చేసే ప్రభుత్వానికి పంపాలన్నారు. కార్యక్రమంలో పలువురు టిడిపి జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు

గరుగుబిల్లి : గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

పంచాయతీ కార్యదర్శిని నిలదీస్తున్న వైస్‌సర్పంచ్, గ్రామ నాయకులు

రసాభాసగా గ్రామసభ

పాచిపెంట: స్థానిక పంచాయతీలో అధికార, ప్రతిపక్ష నాయకుల మధ్య తీవ్రవాగ్వివాదంతో శుక్రవారం జరిగిన గ్రామసభ రసాభాసగా జరిగింది. స్థానిక పెద్దబజార్ కూడలిలో పంచాయతీ కార్యదర్శి సర్పంచ్ పి.సంతోషి ఆధ్వర్యంలో ప్రారంభమైన గ్రామసభ కొద్దిసేపటికే రసాభసగా సభ జరిగింది. స్థానిక వైస్ సర్పంచ్ పల్లేడ వెంకటరమణ, పూసర్ల నర్సింగరావు, పలువురు నాయకులు గ్రామ సభకు తమను పిలవలేదని, రెండేళ్లుగా పంచాయతీ సమావేశాలు నిర్వహించడం లేదని, పంచాయతీకి సంబంధించిన అభివృద్ధి పనులు పాలకవర్గ సభ్యులకు తెలియజేయడం లేదని గ్రామ కార్యదర్శి నవీన్‌ను నిలదీశారు. ఈ దశలో మండల టిడిపి అధ్యక్షులు పిన్నింటి ప్రసాదబాబు కలుగజేసుకోవడంతో అధికార పక్ష నాయకుల మధ్య తీవ్రవాగ్వివాదం చోటుచేసుకుంది. దీంతో పోలీసులు కలుగజేసుకొని సభను సజావుగా జరిపేందుకు ప్రయత్నించారు. కార్యక్రమంలో పిన్నింటి ఈశ్వరరావు, ఎంపిటిసి సభ్యులు పి.ఉమామహేశ్వరరావు, దండి ఏడుకొండలు, ఎపిఒ బి.సత్యనారాయణ పాల్గొన్నారు. మండలంలో 29 పంచాయతీల్లో ప్రధానంగా సిసి రోడ్లు, కాలువలు, భూ అభివృద్ధి పనులు, మినీ గోకులాలకు ప్రతిపాదనలు వచ్చినట్లు ఎపిఒ సత్యనారాయణ తెలిపారు.

ఒకే పంచాయతీ.. రెండు గ్రామ సభలు

- కురుపాం మేజర్ పంచాయతీలో ఫ్లెక్సీ రగడ
- ఉదయం వైసిపి... మధ్యాహ్నం టిడిపి
- ఫ్లెక్సీలో ఎమ్మెల్యే, ఎమ్‌పిల ఫొటోలు లేకపోవడంతో వాగ్వివాదం

ప్రజాశక్తి - కురుపాం

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని అన్ని గ్రామ పంచాయతీల్లో పాధి హామీ చట్టం గ్రామ సభ కురుపాం మేజర్ పంచాయతీలో రసాభాసగా మారింది. శుక్రవారం ఉదయం సర్పంచ్ గార్ల సుజాత, పంచాయతీ కార్యదర్శి బి.అనిత అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభలో కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ఫొటో లేదంటూ టిడిపి నాయకులు సర్పంచ్ సుజాత, ఎంపిపి శెట్టి పద్మావతి లను ప్రశ్నించారు. గ్రామసభ అధ్యక్షత బాధ్యత మాత్రమే తమదని, మిగిలిన ఏర్పాట్లు ఉపాధి హామీ సిబ్బంది చూసుకున్నారని తెలిపారు. అలాగే అరకు ఎంపీ తనూజా రాణి ఫొటో లేదని, తామెవరిపై ఆరోపణలు చేయాలని ఎదురు ప్రశ్న వేయడంతో ఓ మోస్తరుగా తోపులాట జరిగింది. టిడిపి నాయకుడు మినిట్ బుక్‌ను చించివేశారు. అప్పటికే సర్పంచ్ ఆధ్వర్యంలో గుర్తించిన అభివృద్ధి పనులు సభలో చదివి వినిపించారు. సభ మధ్యాహ్నానికి వాయిదా వేయగా, గ్రామసభలో ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ఫొటోలతో గ్రామ సభ నిర్వహించగా, ఎంపి ఫొటో లేకపోవడంతో వైసిపి ప్రజా ప్రతినిధులు సభకు గైర్హాజరయ్యారు. కొద్దిసేపటి తర్వాత టిడిపి వార్డు మెంబర్లు చంటి, నాగరాజు అధ్యక్షతన రెండో సారి గ్రామ సభ నిర్వహించి పలు అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు చేశారు. రెండోసారి సభలో కూడా గ్రామ సభ ప్రత్యేక అధికారి (వెలుగు ఎపిఎం) కిషోర్ కుమార్‌కు స్థానం కల్పించకపోవడంతో అచేతనంగా ఉండి పోయారు. 2024-25 అభివృద్ధి పనులకు సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి ఏ తీర్మానం చేసి పంపుతారో వేచి చూడాల్సిందే. ప్రజల ముందు ఇలా అధికార ప్రతిపక్షాలు వాగ్వివాదం చోటు చేసుకోవడం అంతా విస్మయానికి గురయ్యారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సుజాత, ఉపసర్పంచ్ షేక్ ఆదిల్, జిల్లా కో ఆప్షన్ సభ్యులు షేక్ నిషార్, మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ జిలానీ, ఎంపిటిసి సభ్యులు బంగారు నాయుడు, స్వామి, కూటమి నాయకులు కోలా రంజిత్ కుమార్, జివి రమణమూర్తి, కెవి కొండయ్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


ఫ్లెక్సీపై ఎమ్మెల్యే ఫొటో లేదంటూ నిలదీస్తున్న టిడిపి నాయకులు

ఘనంగా జాతీయ అంతరిక్ష దినోత్సవం

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని సీతంపేట గిరిజన బాలికల అవసరమా ఉన్నత పాఠశాలలో ఈనెల 23న శుక్రవారం నేషనల్ స్పేస్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినిలు నేషనల్ స్పేస్ డే ఆకృతిలో ఉండడంతో పలువుర్ని ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు పి.పద్మశ్రీ మాట్లాడుతూ నేషనల్ స్పేస్‌డే ప్రాముఖ్యత గురించి వివరించారు. కార్యక్రమంలో హెచ్‌డబ్ల్యుఒ పి.అమల, ఉపాధ్యాయులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టం : నేషనల్ అంతరిక్ష దినోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్తు బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులచే పాఠశాల నుంచి ప్రధాన రహదారి మీదుగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ హాజరై ప్రతి విద్యార్థి శాస్త్రవేత్తగా తయారై ప్రపంచానికి ఉపయోగపడే పరిశోధన చేయాలని ఆకాంక్షించారు. తోటపల్లి ప్రాజెక్టు మాజీ చైర్మన్ ఎన్.పాండురంగ, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పాలకొండ : చంద్రయాన్-3 విజయంతో అంతరిక్ష పరిశోధనల్లో భారతకీర్తి పెరిగింది. ఆ రికార్డుకు గుర్తుగా ఏటా ఆగస్టు 23న జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా స్థానిక వెంకంపేట ఎంపియుపి పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. 6వ తరగతి విద్యార్థి మణిదీప్ అంతరిక్ష పరిశోధన నమూనాను తయారు చేసి ప్రదర్శించారు. ప్రధానోపాయుడు జి.పరాంకుశంనాయుడు విద్యార్థులు సైన్స్ అండ్ టెక్నాలజీ రంగం వైపు మొగ్గు చూపాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయిని నాగమణి, ఉపాధ్యాయులు మల్లేశ్వరరావు, గౌతమి, గోపి, ఉదయ తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టంలో రాకెట్ నమూనాను ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ

రైతులకు అల్లం విత్తనాలు అందజేస్తున్న ఎపిఒ చినబాబు

పిఎం జన్‌మాన్‌తో పివిటిజిల అభివృద్ధి

ప్రజాశక్తి - సీతంపేట

పిఎం జన్ మాన్ కార్యక్రమం ద్వారా పివిటిజిల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఐటిడిఎ ఎపిఒ చినబాబు అన్నారు. శుక్రవారం పిఎం జన్ మాన్ అవగాహన సదస్సుల కార్యక్రమంలో భాగంగా మండలంలోని దేవనాపురం పంచాయతీ జెపి దీసరిగూడలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిఎం జన్‌మాన్ ద్వారా 11 రకాల పథకాల ద్వారా పివిటిజిల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఇందులో భాగంగా ఆయుష్మాన్ భారత్ కార్డులు పంపిణీ చేస్తోందని, గ్రామంలో అందరూ ఈ కార్డులు తీసుకోవాలని అన్నారు. పక్కా గృహాలు లేనివారు హౌసింగ్ శాఖ ద్వారా నమోదు చేసుకోవాలన్నారు. ఇంటింటికీ కుళాయి కార్యక్రమం కూడా చేపడుతున్నట్లు తెలిపారు. విద్య, వైద్యం విభాగాల్లో కూడా పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. అంగన్వాడీల ద్వారా పోషకాహారం అందించడం, విడివికెల అభివృద్ధి, జీవనోపాధులు మెరుగుపరచడం వంటి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. అనంతరం జగతిపల్లి జిపిఎస్ పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

అల్లం విత్తనాలు పంపిణీ

అనంతరం వెలుగు అసోసియేషన్ ద్వారా గిరిజన రైతులకు అల్లం విత్తనాలను ఎపిఒకు పంపిణీ చేశారు. గ్రామంలో 27 కుటుంబాలకు ఈ విత్తనాలను పంపిణీ చేశారు. వీటిని 75 శాతం సబ్సిడీతో రైతులకు అందజేశారు. ఒక్కో రైతుకు 10కేజీల చొప్పున అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వెలుగు అసోసియేషన్ డైరెక్టర్ సంజీవరావు, సంస్థ ప్రతినిధులు పాలక నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సుమను విధుల్లోకి తీసుకోవాలి : సిఐటియు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఇంజనీరింగ్ సెక్షన్ వద్ద పని చేస్తున్న పువ్వల సుమపై ఎటువంటి సాక్షాధారాలు లేకుండా ఆమె విధులను నిలిపివేయడం అన్యాయమని, వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు నాయకులు గొర్లి వెంకటరమణ, వి.ఇందిర డిమాండ్ చేశారు. గత కొన్ని రోజులుగా పువ్వల సుమపై వస్తున్న ఆరోపణలపై శుక్రవారం కమిషనర్ కె.శ్రీనివాస్‌తో సిఐటియు నాయకులు చర్చించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సుమను విధుల్లోకి తీసుకోగలిగినట్లయితే, అదే నిబంధనల ప్రకారం తనపై వస్తున్నటు వంటి ఆరోపణలు ఆధారాలతో సహా రుజువైతే తనపై శాఖ అధికారులు, ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అంతే తప్ప తనపై నేరం రుజువుకాక ముందే విధులను నిర్వర్తించకుండా ఆపివేయడం అన్యాయమని అన్నారు. ఈ విషయంపై కమిషనర్ స్పందిస్తూ విధుల్లో ఉన్న సమయంలో సిబ్బంది, అధికారుల పట్ల, తమ వృత్తి పట్ల చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, అందుకే విధులు ఆపివేశామని, పోలీస్ కేసు కూడా వేశామని, విచారణ జరుగుతుందని, విచారణకు కట్టుబడి ఉంటామని తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు మాట్లాడుతూ ఇది కేవలం రాజకీయ కక్షపూరిత చర్యల్లో భాగమని, విధుల్లో చేరిన పువ్వల సుమపై లేని ఆరోపణలు, ఒత్తిళ్ల ఇటీవల కాలంలో ఏమిటని ప్రశ్నించారు. కార్మికులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే క్రమశిక్షణ చర్యలు చేపట్టాలి తప్ప, పూర్తిగా విధుల నుంచి తొలగించడం అన్యాయమని, వెంటనే పువ్వల సుమను విధుల్లోకి తీసుకోవాలని, విధులు నిర్వహిస్తున్న మహిళా ఉద్యోగులపై రాజకీయ ఒత్తిళ్ల ఆపాలని డిమాండ్ చేశారు. అలాగే వార్డుల్లో కొళాయిలు పూర్తిగా రావడంలేదని, వచ్చిన నీరు కూడా బురదగా ఉంటుందని, రెండో వార్డు కొత్తవీధిలో కొళాయిలు రాకపోవడంతో ఉన్న బోరింగ్ పూర్తిగా శిథిలావస్థకు చేరుతుందని దీనివల్ల వీధి ప్రజలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని వెంటనే తగిన చర్యలు చేపట్టాలని కోరారు. లేకుంటే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు బంకురు సూరిబాబు, ఎస్.ఉమామహేశ్వరరావు, పి.రాజశేఖర్ పాల్గొన్నారు.

కమిషనర్‌లో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

గిరిజన వర్సిటీ ఇక్కడే

మంత్రి సంధ్యారాణి

ప్రజాశక్తి - మెంటాడ

ప్రతిష్ఠాత్మక గిరిజన యూనిర్సిటీ వేరేచోటుకు తరలుతుందని జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని యూనివర్శిటీని ఇక్కడే ఏర్పాటు చేస్తున్నామని గిరిజన సంక్షేమశాఖా మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. శుక్రవారం మండలంలోని కుంటినవలస గ్రామంలో జరిగిన గ్రామసభలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గిరిజనవర్శటీని కొత్తవలస మండలం రెల్లి గ్రామానికి తరలించనున్నారని వస్తున్న వార్తలను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్ళగా, ఆయన తోసిపుచ్చారని సంధ్యారాణి తెలిపారు. శంకుస్థాపన జరిగిన చోటే పూర్తిచేస్తామని స్పష్టం చేశారని అన్నారు. అందులో ఉద్యోగాల్లో స్థానికులకే ప్రాధాన్యమిస్తామని కూడా ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని వెల్లడించారు. రాష్ట్రంలో వైసిపి హయాంలో ధ్వంసమైన పంచాయతీ రాజ్ వ్యవస్థకు గత వైభవం తీసుకురావడమే గ్రామసభల ఉద్దేశమని చెప్పారు. ప్రతి ఇంటికీ ఇంకుడుగొయ్యి ఏర్పాటు చేయాలని ఆమె కోరారు. ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో తహశీల్దార్ కె.శ్రీనివాసరావు, ఎంపిడిఒ పి.త్రివిక్రమరావు, ఎపిఒ చినప్పయ్య, సర్పంచ్ రమేష్ నాయుడు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో సత్తా

ప్రజాశక్తి - రామభద్రపురం

రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ క్రీడా పోటీల్లో ఆరికతోట బాలికలు సత్తా చాటారు. ఈ నెల 17,18,19 తేదీల్లో శ్రీకాకుళం జిల్లాలో జరిగిన 11వ అంతర జిల్లాల రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ జూనియర్ పోటీల్లో ఆరికతోట జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థినిలు ప్రథమ స్థానంలో నిలిచారు. బాలురలో ఎం.జ్యోతి ప్రకాష్, డి.రాఘవ, బాలికల్లో భువనేశ్వరి, మధురిమ, జయశ్రీలు ప్రథమ స్థానంలో నిలిచి షీల్డ్ కైవశం చేసుకున్నారు. వీరిని పాఠశాల హెచ్‌ఎం శర్మ, ఉపాధ్యాయులు అభినందించారు

26న అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న రాక

ప్రజాశక్తి-విజయనగరం కోట

రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ సిహెచ్ అయ్యన్న పాత్రుడు ఈనెల 26న విజయనగరం రానున్నారు. స్పీకర్ సోమవారం సాయంత్రం 5 గంటలకు నగరానికి చేరుకొని మాజీ ఎం.పి. పి.వి.జి.రాజుపై పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొంటారు. సాయంత్రం 6 గంటలకు బయలుదేరి నర్సీపట్నం వెళ్లనున్నారు.

నేరాలు ఘోరాలు

మద్యం మత్తులో యువకుడు మృతి

ప్రజాశక్తి-గుర్ల

గుర్ల గ్రామానికి చెందిన బోడ సింగి సన్యాసినాయుడు(43) మద్యం మత్తులో మృతి చెందినట్లు శుక్రవారం పోలీసులు గుర్తించారు. ఈ సంఘటన నాలుగు రోజులు క్రితం విశాఖ గ్రామీణ బ్యాంకు మేడ పైన జరిగినట్లు గుర్తించారు. మేడ పై నుంచి చెడు వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరు కొని మృతుడి వివరాలు సేకరించి గుర్ల గ్రామానికి చెందిన బోడసింగి సన్యాసినాయుడుగా గుర్తించారు. సన్యాసినాయుడు గోశాడ గ్రామానికి చెందిన సత్యవతిని 15ఏళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. నిరంతరం మద్యం మత్తులో వుంటూ నాలుగు రోజులు క్రితం ఇంటి దగ్గర నుంచి కనిపించకుండా వెళ్లిపోయాడు. అప్పట్నుంచి కుటుంబ సభ్యులు వెతికినప్పటికీ. ఆచూకీ దొరకలేదు. మతుడికి భార్య సత్యవతి, ఇద్దరు పిల్లలు హేమలత (10) గౌతం (7) ఉన్నారు. గుర్ల పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-గజపతినగరం

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినటుల విజయనగరం రైల్వే ఎస్ఐ బాలాజీ తెలిపారు. శుక్రవారం బోడసింగిపేట సమీపంలో పట్టాలు దాటుతున్న వ్యక్తిని బరంపూర్ నుంచిసూరత్ వెళ్లే రైలు ఢీకొనడంతో ఆయన మృతి చెందినట్లు తెలిపారవు. మృతుడి మోచేతిపై ఇంద్రాదేవి అనే పచ్చబొట్టు ఉందని, ఇంకా ఎటువంటి ఆధారాలూ లేవని తెలిపారు. మృతేహాన్ని ప్రభుత్వాస్పత్రిలో భద్రపర్చినట్లు తెలిపారు.